# జ్ఞాననేత్రాలు

-శివలెంక నాగ ఉదయలక్ష్మి

'మనసులోని మర్మమును తెలుసుకో...' త్యాగరాజ కృతి మొదలవుతుండగా రవీంద్రభారతి హాల్లోకి ప్రవేశించింది కామేశ్వరి. హాలంతా నిండిపోయింది. క్షణం సేపు నిలబడి చూస్తే ముందు వరుసలో రెండు సీట్లు ఖాళీగా కన్పించాయి. ఎలాగో అందరినీ దాటుకుంటూ ముందు సీట్లో కూర్చుంది. చక్కని సంగతులు వేస్తూ మంద్రంగా, హాయిగా, వినసొంపుగా సాగిపోతోంది కచేరి. సంగీతానికి అనుగుణంగా తాళంవేస్తూ తల తిప్పుతోంది కామేశ్వరి.

ఘమకాలు పలికేటప్పుడు, స్వరజతులు వేసేటప్పుడు కచేరి చేస్తున్న అతని శరీరం కూడా కదులుతోంది. ఆ కళ్లల్లో అమాయకమైన మెరుపులు కనబడుతున్నాయి. ఆ చూపులు ఎక్కడో పరిచయం ఉన్నట్లుగా, తనని వెంటాడుతున్నట్లుగా పదేపదే జ్ఞాపకాల దొంతరలు పేర్చినట్లుగా అనిపిస్తోంది.

ఏమిటిది? తన భ్రమా? లేక నిజమేనా?మనసు సంగీతం మీద నుంచీ మరో కోణంలో ఆలోచించ సాగింది. దూరంగా వున్నా ఆ కళ్లల్లో మెరుపులు తనని తట్టి లేపుతున్నట్లుగా అనిపిస్తోంది. కామేశ్వరి గతం, ఆలోచనల వేగం పుంజుకుని పరిసరాల నుంచి మనసు పరుగెత్తింది అంతగా కచేరి జరుగుతున్నా. ఆమె నిశ్శబ్దంగా కళ్ళు మూసుకుంది.

★★★

కామేశ్వరి పూజ గది శుభ్రం చేస్తోంది. దేవుళ్ల పటాలన్నీ కడిగి కుంకుమ, పూలతో అలంకరించి దీపారాధన చేసింది. రెండు చేతులెత్తి భక్తితో నమస్కారం చేసింది. ఎప్పుడొచ్చాడో తెలియదు. కళ్లు తెరవగానే ఏదో చప్పుడు వినిపించి ప్రక్కకి తిరిగింది కామేశ్వరి. ఎదురుగా భాస్కర్ కనిపించాడు.

"నువ్వా బావా?" అంది.

"ఊ... నేనే. నీ భక్తికి మెచ్చి ప్రత్యక్షమయ్యాను. ఏం వరం కావాలో కోరుకో!" అన్నాడు.

"పో బావా...నేను నిన్నేం ప్రార్థించలేదు" భాస్కర్ వంక చూస్తూ ప్రసాదం ఇచ్చింది.

"సరేగానీ సాయంత్రం మామిడితోటలోకి వచ్చేయ్" అధికారం, చనువు అతని గొంతులో మిళితమయ్యాయి.

"నేను రాను" అంది కామేశ్వరి అంతకంటే గట్టిగా.

"రాకపోతే ఏం చేస్తానో చూడు" అంటూ చూపుడు వేలితో బెదిరిస్తూ "సాయంత్రం నాలుగు గంటలకు మామిడితోటలోకి..." మళ్లీ హెచ్చరిస్తూ ఎదురుగా వస్తున్న బామ్మని ఢీ కొట్టుకుంటూ పరుగెత్తాడు భాస్కర్.

"ఏమిటే కామీ! వాడి హడావుడి...మామిడితోట అంటాడేమిటి?" అంది ఆరాగా దీర్ఘం తీస్తూ.

"ఏం లేదు బామ్మా! సాయంత్రం బావ మామిడితోటలో చదువుకుంటాడుట. ప్రమోషన్ కోసం ఏదో పరీక్షలు వ్రాస్తున్నాడుట" చటుక్కున అబద్ధం చెప్పేసింది.

అయినా ఆవిడ అనుమానంగా కామేశ్వరి వంక చూస్తూ "ఏమిటో ఈ కాలం పిల్లల చేష్టలు?" అంటూ బామ్మ, నాన్న గదిలోకి దారి తీసింది ఈ సమాచారం అందించేందుకు.

కామేశ్వరి తండ్రి పరమేశ్వరరావుగారికి దాదాపు పాతిక ఎకరాల పొలం, పాడి పంట, పరపతి అన్నీ ఉన్నాయి. కృష్ణాపురం చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా ఆయన పేరు తెలియనివారు లేరు. ఆయనకి ఒక్కతే కూతురు కామేశ్వరి. భార్య శారదని, తల్లి అన్నపూర్ణమ్మగారిని సమానంగా చూస్తాడు. పరమేశ్వరరావుగారి చెల్లెలు రాధని కూడా ఆ ఊళ్లోనే వెంకటరావుగారికి ఇచ్చి చేసారు. రాధకి ఒక్కడే కొడుకు భాస్కర్, ఒక్క కూతురు శ్రావణి.

పరమేశ్వరరావుగారికి చెల్లెలి కొడుకు భాస్కర్‌కి కామేశ్వరిని ఇచ్చి పెళ్లి చేయాలని అనుకున్నాడు. కామేశ్వరి, భాస్కర్‌లకు ఒకరంటే ఒకరికి అభిమానం. భాస్కర్ ఎంకాం పాసై స్టేట్‌బ్యాంక్‌లో ఉద్యోగంలో చేరి ఏడాది అయింది. ముహూర్తాలు కుదిరితే పెళ్లి చేసేద్దామని రెండు కుటుంబాలవారు ఎదురు చూస్తున్నారు. ఈడొచ్చిన పిల్లలకి వెంటనే పెళ్లి చేసేయాలని పరమేశ్వరరావుగారి తల్లి అన్నపూర్ణమ్మగారి ఉద్దేశ్యం. ప్రక్క గదిలో వున్న కొడుకు దగ్గరకు వెళ్లింది ఆవిడ.

"ఒరేయ్ పరమం! ముందు మంచి ముహూర్తాలు చూడు. పెళ్లి కాకుండా భాస్కర్ మనింటికి వస్తే బాగుండదురా!"

"అదేమిటమ్మా! భాస్కర్ పరాయివాడా?" పరమేశ్వరరావుగారు నవ్వుతూ చెప్పారు.

"ఏమిటో నాయనా! ఈకాలం పిల్లలు వాళ్లే పెళ్లి చేసేసుకుంటున్నారు. నా మాట విని వెంటనే పెళ్లి చేసేయ్"

బామ్మ మాటలు కామేశ్వరికి వినబడుతూనే వున్నాయి. తండ్రి కూడా పెళ్లి చేస్తానని హామీ ఇచ్చాడు. ఆవిడ వెంటనే పక్క వీధిలో వున్న కూతురు ఇంటికి పరుగెత్తింది. అనుకున్నట్లుగా కామేశ్వరికి, భాస్కర్‌కి పెళ్లయిపోయింది.

★★★

పెళ్లయిన వెంటనే ఇద్దరూ విజయవాడలో కాపురం పెట్టేసారు. కామేశ్వరికి పెళ్లయి రెండేళ్లయినా పిల్లలు పుట్టలేదు. ఇంకా పిల్లలు పుట్టలేదని బామ్మ బాధపడుతూనే కాలం చేసింది. దాదాపు పది సంవత్సరాలకు కామేశ్వరి నెల తప్పిందనగానే అత్తగారికి, తల్లిదండ్రులకు, అందరికంటే భాస్కర్ మురిసిపోయాడు. కామేశ్వరిని అపురూపంగా చూసుకోసాగారు. కామేశ్వరి నెలలు నిండగానే పిల్లవాడిని ప్రసవించింది.

కామేశ్వరి, భాస్కర్ ఊహించినట్లుగా పండంటి కొడుకు పుట్టలేదు. మానసిక పరిపక్వతలేని పిల్లవాడు పుట్టాడు. పుట్టబోయే కొడుకు మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ దంపతులకు ఎంతో ఆవేదన కలిగింది. మేనరికాలవల్ల ఇలాంటి కొడుకు పుట్టాడని డాక్టర్స్ చెప్పడంతో కృంగిపోయారిద్దరూ.

'తెల్లగా, దబ్బపండు ఛాయ, నల్లని వత్తయిన జుట్టు, మెరిసిపోయే కనుపాపలు.. ఇంత అందంగా పుట్టించావు, వీడికి ఈ లోపం ఎందుకు పెట్టాడో ఆ భగవంతుడు' అని కామేశ్వరి అనుక్షణం దిగులుతో బాధపడేది. ఏదన్నా హోమ్‌లో పెట్టమని బంధువులు, స్నేహితులు సలహా ఇచ్చారు. కానీ కామేశ్వరికి మనసొప్పలేదు. ఎంతో కష్టపడి, నవమాసాలు మోసి కన్న పిల్లవాడిని దూరం చేసుకోవడానికి ఆమె మనస్సు అంగీకరించలేకపోయింది. అందుకే ఎంతమంది ఎంత సానుభూతి చూపించినా తనెందుకు పెంచలేదు అన్న ఆత్మస్థైర్యంతో బ్రతకడం మొదలుపెట్టింది. భర్తకి కూడా ధైర్యం చెప్పింది. పిల్లవాడికి కిరణ్ అని పేరు పెట్టారు.

★★★

కిరణ్ పెద్దవాడవుతున్నాడు. కానీ బుద్ధి ఎదగడంలేదు. కామేశ్వరి కొడుకుని తీసుకుని ఎక్కడకు వెళ్లాలన్నా అందరూ తనని జాలితో చూస్తున్నట్లు అనిపించేది. ఎన్ని వైద్యాలు చేయించినా కిరణ్‌లో మార్పులేదని బాధపడుతూ ఉండేది. కానీ భార్యాభర్తలు ఇద్దరూ ఎంత మనోవేదన ఉన్నా దాచుకుని కిరణ్‌ని ఓర్పుతో పెంచుకుంటూ వస్తున్నారు.

ఎదుగుతున్న వయస్సు, ఎదగని మనస్సుతో వున్న కిరణ్‌ని చూస్తే కామేశ్వరి మనస్సు బాధతో మెలికలు తిరిగేది. కిరణ్ కోసం మ్రొక్కని దేవుడు లేడు. వైద్యంకోసం తిరగని ఊరు లేదు. తనకూడా తిరుగుతూ నంగి నంగి మాటలతో అమాయకమైన ప్రశ్నలు వేస్తుంటాడు. భాస్కర్ కూడా కిరణ్‌ని చూస్తే బాధపడినా ఆ దిగులును మనస్సులోనే దాచుకుంటూ భార్యని నవ్వించడానికి ప్రయత్నించేవాడు.

★★★

ఆ రోజు తనకు బాగా గుర్తు. కిరణ్ పుట్టిన రోజు. వాడికి తలంటుపోసి "కన్నా! నీకేం కావాలిరా'' అంటూ ముద్దుగా అడిగింది కామేశ్వరి.



**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాదిపోటీలో ఎంపికైన కథ**

"పాయతం చెయ్యి" అన్నాడు.

"తప్పకుండా చేస్తాను నాన్నా" అంటూ సాయంత్రం భాస్కర్‌ని బ్యాంకు నుంచి తొందరగా రమ్మని చెప్పింది.

"ఏమిటో కామీ! మన కిరణ్‌కి ఈ రోజుతో పద్దెనిమిది సంవత్సరాలు వస్తాయి. ఎందుకో...ఇవాళ మరీ బాధ కలుగుతుందోయ్. వాడు సరిగ్గా ఉంటే ఇంటర్మీడియెట్‌లోకి వచ్చేవాడు" భాస్కర్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

సున్నితంగా కళ్ళు తుడుస్తూ "ఛ...ఛ... అదేమిటండి అన్నీ సవ్యంగా ఉన్నవాళ్లని పెంచడం తేలిక. వాళ్లకి మన అవసరం కూడా అంతగా ఉండదు. ఇలాంటి వాళ్లని చూడడమే గొప్ప. మన కడుపున పుట్టాడు కాబట్టి సేవ చేస్తున్నాం. వేరే వాళ్లకి మనం సేవ చేస్తామా? దయచేసి ఇవేమీ మనసులో పెట్టుకోకండి. భగవంతుడు మనకి ఈ అవకాశం ఇచ్చాడని ఆశిద్దాం. ఇవాళ వాడి పుట్టినరోజు" అంది కామేశ్వరి.

భార్య మాటలకు తలూపుతూ "సాయంత్రం తొందరగా వస్తాను. కిరణ్‌ని సర్కస్‌కి తీసుకువెళ్దాం. తయారుగా ఉండండి" అని చెప్పి వెళ్లిపోయాడు భాస్కర్. భాస్కర్ వెళ్లాక దేవుడికి పూజ చేసి పాయసం నైవేద్యం పెట్టింది కామేశ్వరి. ఎప్పుడొచ్చాడో తెలియదు "మమ్మీ పాయతం" అంటూ గోల చేస్తున్నాడు కిరణ్.

"ఒక్క క్షణం ఆగు నాన్నా" అంటూ పాయసం గ్లాసులో పోసి స్పూన్‌తో తినిపించసాగింది. రెండు స్పూన్లు తినకుండానే కిరణ్ కిందపడిపోయాడు.


"కిరణ్...కిరణ్" అంటూ చేతులు పట్టుకుని వూపుతూ కంగారుగా పక్కవాళ్లకోసం పరుగెత్తింది. అప్పటికే కిరణ్ స్పృహలోలేడు. డాక్టర్ దగ్గరకు వెళ్లగానే పరీక్ష చేసి ప్రాణం పోయి పదినిముషాలు అయిందని చెప్పాడు ఆయన.

భాస్కర్‌కి కబురు తెలిసి వచ్చేసరికి కామేశ్వరి అచేతనంగా ఉండిపోయింది. వూహించని విధంగా జరిగేసరికి వాళ్ల మనస్సులు మొద్దుబారిపోయాయి. అంత వేదనలో కూడా కామేశ్వరి ఆలోచనలు కిరణ్ చుట్టూ పరిభ్రమిస్తూనే ఉన్నాయి. తన కొడుకు ఒక అనామకుడిలా ఎందుకూ పనికిరాకుండా వెళ్లిపోయాడనుకోగానే ఆమెకు దుఃఖం ఆగలేదు. పద్దెనిమిది సంవత్సరాలు కంటికి రెప్పలాగా కాపాడుకున్న కన్నబిడ్డని పసివాడులాగా ప్రతిక్షణం జాగ్రత్తగా చూసుకుంటూ వచ్చింది. అందరి పిల్లల్లాగా తన కొడుకు ఎదగాలని ఆశపడింది. అంత బాధలోనూ ఆమె అంతరంగంలో ఏదో ఆశాకిరణ్ తళుక్కుమంది. వెంటనే భాస్కర్‌కి చెప్పింది. భాస్కర్ కొడుకు కళ్లు డొనేట్ చేయడానికి ప్రయత్నాలు చేసి సంతకాలు కూడా చేసేసారు ఇద్దరూ. ఆ కళ్ళు ఎవరికి డొనేట్ చేయబడ్డాయో తెలియదు. కానీ అవి దివ్యజ్యోతులై మరో చీకటి బ్రతుకులో దీపాలై ప్రకాశిస్తాయని తెలుసు. ఏదో మంచి పనిచేసామన్న ఆత్మతృప్తి ఆ తల్లిదండ్రులకు కలిగింది.



## పేరుకి తగ్గ అందం

పేరుకి తగ్గ అందంతో 'మాయజాలం' సృష్టించిన నటి దీప. ఎస్వీ కృష్ణారెడ్డి కొత్తచిత్రంలో అందంగా కన్పించి అందరి మనసుల్ని ఆకట్టుకుంది. చిదిమి దీపం పెట్టుకునే అందమున్న ఈ జవ్వని తెలుగులో మరిన్ని అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. 'మాయజాలం చిత్రంలో నాకు మంచి పాత్ర ఇచ్చిన ఎస్వీగారికి కృతజ్ఞతలు. నా టాలెంట్‌ని నిరూపించుకునేందుకు రెండు మూడు చిత్రాల్లో నటించాలని ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి' అంటోంది సోగకళ్ళ దీప.




***

హాల్లో చప్పట్లు మారుమ్రోగుతున్నాయి. అప్పటికి మామూలు లోకంలోకి వచ్చింది కామేశ్వరి. ప్రక్కనే కూర్చున్న ఆవిడ వంక చూసింది కామేశ్వరి.

"కచేరి చేస్తున్నది మా అబ్బాయే శ్రీచరణ్. సంగీతంలో మంచి పేరు సంపాదించుకున్నాడు" గర్వంగా చెబుతోంది ఆవిడ. ఆవిడ కళ్లల్లో ఒక విధమైన ఆనందం. అడగకపోయినా చెబుతోంది.

"మావాడికి కళ్ళులేవు. ఎవరో కిరణ్‌ట. అతని కళ్ళు దానం చేయడం వలన ఈరోజు ప్రపంచాన్ని చూడగలుగుతున్నాడు. అతని కళ్ళు దానం చేయడంవలన వాడి జీవితం మలుపు తిరిగింది. ఈ రోజు మంచి పేరు సంపాదించుకున్నాడు. ఆ పుణ్యదంపతులు, ఆ కిరణ్ తల్లిదండ్రులు కనిపిస్తే వాళ్ల కాళ్ళు కడిగి నా బిడ్డ బ్రతుకులో జ్యోతులు వెలిగించారని చెప్పాలని ఉందమ్మా" ఆవిడలో ఆవేశం, ఆనందం ఉప్పొంగిపోతున్నాయి. ఆ మాటలు విన్న కామేశ్వరికి కూడా ఆనందభాష్పాలు జారిపోతున్నాయి. కచేరీ అవగానే తల్లి దగ్గరకొచ్చిన శ్రీచరణ్‌లో కామేశ్వరికి కిరణ్ కనబడుతున్నాడు. కిరణ్ కళ్ళు తననే చూస్తున్నట్లున్నాయి. ఆ చూపుల్లో మెరుపులు తళుక్కుమంటూ తనని వెంటాడుతున్నాయి. 'అమ్మా! నేను చనిపోలేదు. మరొకరి కళ్లల్లోంచి చూస్తున్నాను. నేను జీవించే ఉన్నాను' అని చెబుతున్నట్లుగా ఉంది. శ్రీచరణ్ తల్లి చెబుతోంది మా అబ్బాయి అని.

"నమస్కారం ఆంటీ!" అంటున్న అతన్ని దీవించడానికి చెయ్యి ఎత్తింది కామేశ్వరి.

ప్రపంచంలో పనికిరాడనుకున్న కిరణ్ అతని కళ్లు జ్యోతులై చరణ్ కళ్లల్లో వెలుగు కిరణాలుగా ప్రవహిస్తున్నాయి. తన కొడుకు చాలా గొప్పవాడని, ఆ జ్ఞాననేత్రాలతో ప్రపంచమంతా జ్యోతిగా ప్రకాశిస్తోంది ఆ మాతృహృదయం ఉప్పొంగిపోయింది. కిరణ్ జ్ఞాననేత్రాలు ఆమెను స్పృశిస్తున్నాయి. ఆ క్షణంలో ఆమె జన్మ ధన్యమయిందని, తల్లిగా అలాంటి కొడుకును కన్నందుకు గర్వంగా ముందుకు కదిలింది కామేశ్వరి.

★